కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ నీటిని కాచి చల్లార్చి తాగాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ శ్రీవిద్య తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో వైద్య శిబిరం నిర్వహించి, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల గొంతు నొప్పి, జలుబు, వైరల్ జ్వరాలు, దగ్గు, చెవి నొప్పి వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆహార పదార్థాలను వేడిగా తినాలని, నిల్వ ఉంచిన వంటలు తినకూడదని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి, మాత్రలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, ఎఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల ప్రాణభద్రత మనందరి సామాజిక బాధ్యతని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండా అంశాలపై సమీక్షించారు. ఇందులో జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల ప్రమాద డేటా విశ్లేషణ, 3 కంటే ఎక్కువ మరణాలపై ఉమ్మడి తనిఖీ అంశాలపై సవివరంగా చర్చించారు. ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ అండ్ డెత్ డేటాపై సమీక్షించారు. వచ్చే ఏడాది 2024-2025 కోసం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, సరిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను అమలు పరచడం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు పరిహారం, గత రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ఇందులో 2023, 2024లో ఇప్పటి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలపై సమీక్షించారు. 2023లో మొత్తం 593 ప్రమాదాలు జరుగగా, ఇందులో 274 ప్రాణాంతకం కేసులు, 319 ప్రాణాంతకం కానివి, 314 మరణాలు, 786 మంది గాయపడినట్లు తెలిపారు. అలాగే 2024లో అక్టోబర్ మాసాంతం వరకు మొత్తం 533 ప్రమాదాలు జరుగగా, ఇందులో 255 ప్రాణాంతకం కేసులు, 278 ప్రాణాంతకం కానివి, 289 మరణాలు, 656 మంది గాయపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలై నుండి అక్టోబర్ మాసం వరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించిన ఫలితంగా గతంలో ఇదే సమయానికి 2023 కంటే 2024లో 10.11 శాతం రోడ్డు ప్రమాదాలలో తగ్గుదల ఉన్నట్లు అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, పోలీసు, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని, అవగాహనతోనే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. వాహనాల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్స్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్, ఆసుపత్రులు ఉన్నచోట స్పీడ్ బ్రేకర్స్, బేరి గేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ పై అవగాహనతో ఉండాలని, రోడ్ సేఫ్టీలో పాటించాల్సిన నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విషయమై ప్రతి ఒక్కరూ సీరియస్‌గా ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరు సురక్షితంగా బయటికి వెళ్లి తిరిగి వచ్చేలా జాగ్రత్తగా పాటించాలన్నారు. జీవితం కంటే ఏది ముఖ్యం కాదని తెలుసుకోవాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాలలు కళాశాలలు ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అన్ని బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి రహదారి మలుపు వద్ద సూచిక బోర్డులు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, వైదేవి, ఆర్‌డిఒ శ్రీనివాస్, ఆర్‌టిఒ ప్రసాద్, ఎంపిడిఒలు, పోలీస్ శాఖ అధికారులు, డిఎస్‌పిలు, ఆర్అండ్‌బి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తినిస్తాయి

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, ఆటల పోటీలు-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందన్నారు. ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయని. 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీస్ మీట్‌కు పంపిస్తామన్నారు. పిల్లల్ని కూడా ఆటలు ఎక్కువగా ఆడించాలని దాని ద్వారా వారు మానసికంగా, శారీరకంగా దృఢంగా అవుతారని అన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత మొట్ట మొదటి సారిగా జిల్లాలో పోలీసు స్పోర్ట్స్ మీట్ ప్రారంభించడం జరిగిందన్నారు. 27, 28, 29వ తేదీలలో వరుసగా మూడు రోజులు పాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 4 జోన్లకు సంబంధించిన 4 టీమ్‌లు (రాయచోటి, మదనపల్లి, రాజంపేట, ఎఆర్ హెడ్ క్వార్టర్స్) కబడ్డీ, వాలీబాల్, ఫుట్ బాల్, అథ్లెటిక్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నీస్, షటిల్ మొదలగు క్రీడలలో పాల్గొంటారన్నారు. స్పోర్ట్స్ మరియూ ఆటలు జరుపుకోవడానికి అవకాశం కల్పించిన డిజిపి ద్వారకా తిరుమలరావు, కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాయచోటి డిఎస్‌పి ఎంఆర్.కృష్ణమోహన్, మదనపల్లి, రాజంపేట డిఎస్‌పిలు డి.కొండయ్య నాయుడు, ఎన్.సుధాకర్, ఎఆర్ డిఎస్‌పి బి.చిన్నికృష్ణ, జిల్లాలోని సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, పిఇటి మాస్టర్లు పాల్గొన్నారు.

పోలీస్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ఆర్‌టిపిపిలో కొనసాగుతున్న ఉద్రిక్తత

ఆర్‌టిపిపిలో నిలిపివేసిన లారీలు (ఇన్‌సెట్‌లో) మోహరించిన పోలీసులు

- ఆర్‌టిపిపి, కొండాపురంలో పోలీసుల మోహరింపు
- బూడిద కోసం కూటమి నేతల పోట్లాట
- ఎమ్మెల్యే ఆది, జెసి మధ్య ఆధిపత్య పోరు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపి నుంచి బూడిదను తాడిపత్రికి తరలించే విషయంలో జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి గ్రూపుల మధ్య వివాదం కొనసాగుతోంది. రెండు రోజులుగా ఆర్‌టిపిపి, కొండాపురం సరిహద్దు ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రెండు గ్రూపుల మధ్య వివాదానికి సంబంధించి చర్చలు జరుగుతున్నా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. తాడిపత్రి నుంచి జెసి అనుచరులు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా పోలీసు బలగాలు మొహరించాయి. అనంతపురం, కడప జిల్లా సరిహద్దు ప్రాంతమైన కొండాపురం మండలంలో చెక్ ఫోస్ట్ ఏర్పాటు చేశారు. కాగా జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి ఇద్దరూ కూటమి నేతలే కావడం విశేషం. జెసి దివాకర్‌రెడ్డి తాడిపత్రికి చెందిన టిడిపి నాయకుడు, ఆదినారాయణరెడ్డి బిజెపి ఎమ్మెల్యే వీళ్లిద్దరి మధ్య ఫ్లైయాష్ తరలింపునకు సంబంధించిన ఒప్పందంపై విభేదాలు తలెత్తాయి. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోకి ఆర్‌టిపిపి వస్తుంది. తమ నియోజకవర్గంలో ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలని ఆదినారాయణరెడ్డి భావిస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని సిమెంట్ పరిశ్రమలకు ఆర్‌టిపిపి నుంచి జెసి అనుచరుల వాహనాలు ఫ్లైయాష్ తరలిస్తున్నాయి. దీనిపై ఒప్పందం కుదరకపోవడంతో జెసి వాహనాల్ని ఆర్‌టిపిపికి ఎట్టి పరిస్థితుల్లో రానివ్వకూడదని ఆదినారాయణరెడ్డి అనుచరులు పంతం పట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం జెసి వాహనాలు ఆర్‌టిపిపికి వస్తున్నాయని తెలిసి, ఆర్‌టిపిపి సమీపంలోని కలమల్ల వద్ద ఆదినారాయణరెడ్డి అనుచరులు భారీగా మోహరించారు. వస్తే అడ్డుకోడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ బందోబస్తు ఏర్పాటు చేశారు. బూడిద తమ దగ్గర ఉంది కాబట్టి తమ వాహనాలతో తరలిస్తామని ఆదినారాయణరెడ్డి అనుచరులు అంటున్నారు. కానీ తరలించేది తాడిపత్రికి కాబట్టి తమ వాహనాల్లోనే తీసుకువస్తామని జెసి ప్రభాకర్‌రెడ్డి అంటున్నారు. ఈ క్రమంలో రెండు గ్రూపుల మధ్య పంచాయతీ పెరిగిపోయింది. జెసి వాహనాలు వస్తే అడ్డుకుని తీరుమామని ఆదినారాయణరెడ్డి వర్గీయులు అంటున్నారు. కాగా ఆర్‌టిపిపిలో బుధవారం 144సెక్షన్ అమలుకు తహశీల్దారు శోభన్ బాబు ఉత్తరవులు జారీ చేసారు. ఉన్నతాధికారుల అదేశాల మెరకు అల్లర్లు జరగకుండా ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ యార్డు సమావేశ భవనంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో సమస్యగా ఉన్న రోడ్లలో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇంకా సమస్యలు ఉంటే మళ్ళీ దశలో రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా వాల్మీకిపురంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లికార్జున రెడ్డి, గాంధీపేట రమణ, సయ్యద్‌బాషా, రాజేంద్రాచారి, పివి నారాయణ, మురళి, సైదు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ద పల్లిశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఎపి ఎంఆర్‌పిఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా మాదిగ జాతి కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసిన దొడ్డి సురేష్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి సురేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో నాకు స్థానం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజుకి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ కి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ మాదిగల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎద్దులపల్లి చెన్నకేశవులు, అన్నమయ్య జిల్లా యువజన అధ్యక్షులు పెద్దపల్లి అశోక్, రామాపురం మండల అధ్యక్షులు శివశంకర్, ఉపాధ్యక్షులు సుబ్బారావు, కె.వెంకట రమణ, నాగేశ్వరరావు, దేవేంద్ర, భీమయ్య, ఇ.రమణయ్య, ఇ.ఆంజనేయులు, నాగార్జున పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన 11వ పిఆర్‌సి, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులు వెంటనే చెల్లించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో రీజినల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటిం చాలన్నారు. పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధ నేతర కార్యక్రమ భారం తగ్గించాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరిం చాలని కోరారు. సిపిఎస్ రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో తీసుకురావాలని కోరారు. డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులను చేపట్టాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించక పోతే ఎస్‌టియు ఆధ్వర్యంలో ఇతర సంఘాలను కలుపుకొని నిరసన కార్యక్రమాలు చేయబడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కమిటీ కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళీకుమార్, జిల్లా మైనారిటీ కన్వీనర్ మున్వర్, ఎస్టియు నాయకులు నరసింహులు, సదాశివారెడ్డి, నాగరాజ, సుధాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, గోపికృష్ణ, శేఖర్‌రెడ్డి, రామాంజులు, ప్రదీప్, మన్సూర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని అధిగమించాలి : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో మనం లక్ష్యాన్ని అధిగమించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి టిడిపి శ్రేణులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి 43 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలో 50 లక్షలకుపైగా సభ్యత్వాలు నమోదు చేయడం, గతానికి భిన్నంగా ఈసారి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో టిడిపి మెంబర్ షిప్ డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో తెలుగుదేశం పార్టీలో సరికొత్త రిఫరల్ సిస్టంకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపల్లి బాబు రెడ్డి, డాక్టర్ మల్లెల రెడ్డి బాష, పురం రామ్మూర్తి, అమర్నాథ్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మహమ్మద్ పీర్, వసంతాల రాజ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్య రక్షణ పొందలని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం మాధవరం గ్రామ పంచాయతీ వడ్డెపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థులందురూ ఎప్పుడూ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని,రోజుకి కనీసం ఒకసారి స్నానం చేయాలని ప్రతీరోజూ ఉతికేసిన దుస్తులు ధరించాలని,నీటి కొరత ఉన్నప్పుడు, వారానికి కనీసం రెండుసార్లు స్నానం చేయాలని, నీటి లభ్యత చాలా అధ్వానంగా ఉన్నప్పుడు, శరీరాన్ని శుభ్రమైన, తడి తువ్వాలుతో తుడుచుకోవాలని వివరించారు. పళ్లని రోజుకి రెండుసార్లు శుభ్రం చేసుకోవాలని ,ముఖ్యంగా నిద్ర లేచిన వెంటనే, రాత్రి నిద్రించటానికి ముందు పళ్లను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. వంట ఏజెన్సీ వారు ఆహారం తయారు చేయటానికి ముందు, వడ్డించటానికి ముందు చేతులను శుభ్ర పరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా హెల్త్ సూపర్‌వైజర్ జి.రవణమ్మ, ప్రధానోపాధ్యాయులు రావూరి శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయచోటి

కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కొండూరు శ్రీనివాసురాజు పేర్కొన్నారు. బుధవారం విజయవాడలో సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో కెజిబివి అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డి.దేవనాదరెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలిపి పలు సమస్యలపై ప్రాతినిధ్యం చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయనిలకు ప్రధాన సమస్యలైన ఎంటిఎస్ అమలుపై సత్వర నిర్ణయం తీసుకోవాలని, రాత్రి పని వేళలు లేకుండా నైట్ షిఫ్ట్ డ్యూటీ లకు వార్డెన్ లను నియమించాలని కోరారు. ఆరోగ్య కార్డులు, మహిళలకు ప్రత్యేక సెలవులు, మెడికల్ లీవులు తదితర సమస్యలపై వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఎ నాయకులు రామకృష్ణంరాజు, కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి మండలాధ్యక్షులుగా గన్నేసుబ్బ నరసయ్య నాయుడు పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం ఆయన అభిమానులు టిడిపి కార్యాలయంలో కేకు కోసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణులకు పండ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరి సంక్షేమం, అభివృద్ధి కోరుకునే వ్యక్తి గన్నే సుబ్బ నరసయ్య నాయుడు అని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్ల అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మండెం అబూబకర్, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.కరీం, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు చుండు సుధీర్, పార్లమెంట్ యూత్ ఉపాధ్యక్షులు సింగన పరశురాం, ఉప సర్పంచ్ కామినేని సతీష్, వరదయ్యగారిపల్లె ఎంపిటిసి నాగార్జున, సర్పంచ్ మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు కొన్ని సాంబశివయ్య నాయుడు పాల్గొన్నారు.

బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పీలేరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సిసి రోడ్ల నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన అవి పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కెవిపల్లి మండలం, సొరకాయలపేట పంచాయతీ, వంకవారవడ్డిపల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులను కలెక్టర్ డ్వామా పీడీ వెంకటరత్నం, ఎంపిడిఒ సుధాకర్, ఎపిఒ నాగరాజ, ఎఇ పి. సుబ్రత్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నాణ్యత, పొడవు, వెడల్పు, అంచనా ఖర్చు వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలు సుకున్నారు. రూ.8 లక్షల ఖర్చుతో ప్రధాన రహదారి 164 మీటర్ల పొడవు, వెడ ల్పు 3.75 మీటర్లతో నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టరుకు వివరించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని కలెక్టర్ సూచించారు. అంతకు ముందు కలెక్టర్ మండలంలోని ఎపిమోడల్ స్కూల్‌ను సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల నిర్వ హణపై ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. పాఠశాలలో అపార్ ఐడి జనరేషన్ స్థితిని అడిగి తెలుసుకున్నారు. అపార్ లేని వారందరికీ త్వరగా అపార్ ఐడి జనరేట్ చేయాలని పంచాయతీ కార్యదర్శి రాధిక, విఆర్ఒ, ఎంఇఒ రెడ్డిబాషా పాఠశాల హెచ్‌ఎంలను ఆదేశించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, డ్వామా పీడీ వెంకట రత్నం, తహశీల్దార్ క్రాంతి కుమార్, ఎంపిడిఒ సుధాకర్, ఎంఇఒ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు సాంఘిక దురాచారం : బాల్య వివాహాలు చేయడం ఓ అసాంఘిక దురాచారమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కెవిపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో కలెక్టర్ బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి బాల్య వివాహాలు ఆటంకం కలిగిస్తాయని అన్నారు. అంతేకాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను కూడా అది దూరం చేస్తుందని చెప్పారు. బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ సాకారానికి కృషి చేద్దామంటూ బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

'సుగవాసి'కి ముఖ్యమంత్రి ప్రశంస

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంను ప్రత్యేకించి ప్రశంసించడం గర్వించదగ్గ విషయమని టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకట నలో హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సుమారు 30 వేల మంది సభ్యులతో జరిగిన టెలికాన్ఫరెన్స్ కార్యక్రమంలో ప్రత్యేకించి సుగవాసిని అభినందించడం గొప్ప విషయమని అన్నారు. రాజంపేట నియోజకవర్గంలో సుమారు 96,600 క్రియాశీలక సభ్యత్వాలు పూర్తి కావడం, సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఈ ఘనత సాధించడం ప్రశంసనీయమని సిఎం వ్యాఖ్యానించడం సుగవాసి నిబద్ధతకు, కృషికి నిదర్శనమని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కొరకు ఈ ప్రాం తంలో ఉద్యాన పరిశ్రమలు ఏర్పాటు చేసి, అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం, జిల్లా కేంద్రం ఏర్పాటుకు కృషిచేసి ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని కోరారు.

నార్త్, సౌత్ జోన్, తూర్పు గోదావరి జట్లు విజయం

తలపడుతున్న రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, తూర్పు గోదావరి జట్లు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా బుధవారం వివిధ క్రీడా మైదానాల్లో జరిగిన పోటీల్లో నార్త్, సౌన్ జోన్, తూర్పు గోదావరి జట్లు విజయం సాధించాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై తొమ్మిది వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్క్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 27.4 ఓవర్లలో 97 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 45, జయకృష్ణ 14 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని శ్రీకర్ సాయి రెడ్డి 4, అచ్యుత్ హేమంత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 98 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 14.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 101 పరుగులు చేసి తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని హిమకర్ 56 హర్షవర్ధన్ 34 (నాటౌట్) పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున ఒక వికెట్ తీసుకున్నాడు.

ప్రకాశంపై సౌత్ జోన్ జట్టు..: కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టుపై 8 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. పుల్కా బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 37.0 ఓవర్లలో 221 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రోహిత్ 67, అభినవ్ 38 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని సుతేజ్ రెడ్డి 4 మాధవ్ 3, ధరణి కుమార్ నాయుడు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 222 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 36.1 ఓవర్లలో 222 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రేవంత్ రెడ్డి 99 (నాటౌట్), తేజ రెడ్డి 55 పరుగులు చేశారు.

సెంట్రల్ జోన్‌పై తూర్పుగోదావరి జట్టు..: వైఎస్ఆర్ఆర్ ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై రెండు వికెట్ల తేడాతో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 38.2 ఓవర్లలో 129 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సమన్విత్ 35, దుర్గారావు 24 పరుగులు చేశారు. తూర్పు గోదావరి జట్టులోని సందేశ్ నాలుగు, శివ సూర్య రెండు, వంశీ నారాయణ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 130 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కుదిగిన తూర్పు గోదావరి జట్టు 32.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 132పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ప్రాజెక్టులోని విజయ్ 51, రంగరాజు 32 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ చెట్టులోని మానస్ అదుతేంగా పోలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు.

సిఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న రూపానందరెడ్డి

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- సిఎం చంద్రబాబుకు 'ముక్కా' వినతి

ప్రజాశక్తి-పుల్లంపేట

రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. సమస్యలన్నిటికీ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని పేర్కొన్నారు. రైల్వే కోడూరు ప్రజలు తమపై పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి వీధికి సిమెంటు రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చేస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న మంజుల

విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక లాభాలు

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

విలువ ఆధారిత ఉత్పత్తులతో మెరుగైన లాభాలు పొందవచ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల మహిళా రైతులకు సూచించారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ మహిళలకు ఐదు రోజులపాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, పాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను మహిళతో చేయిస్తామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి పొందుట కొరకు ఈ విలువ ఆధారిత ఉత్పత్తులతో వ్యాపారం చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని అన్నారు. జిల్లాలో అధికంగా రైతులు పండించే పంటలైన మామిడి, టమోటా, వేరుశనగ, బొప్పాయి ద్వారా వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చునన్నారు. గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది, 20 మంది గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ముక్కా వరలక్ష్మి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

మెరుగైన వైద్య సేవలు అందించండి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్నఓరంపాడు క్రాస్ రోడ్‌లో బుధవారం నూతన ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, సాయివికాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్నతమైన ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయని అన్నారు. కార్యక్రమంలో రాజు కుంట సర్పంచ్ గుత్తి నరసింహులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు పివి.రమణ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండు, పాత బస్టాండు పరిసర ప్రాంతాలలోని నిరాశ్రయ పేదలకు సుమారు 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి పెరిగిన నేపథ్యంలో నిరాశ్రయులైన వారికి దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. సుమారు 13 ఏళ్ళ నుంచి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల వారు ముందుకు వచ్చి నిరాశ్రయులైన వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.చిన్నయ్య, ఎన్.మణి, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్బారావు, కట్టా కృష్ణయ్య, పి.భాస్కర్, కే.నరేంద్ర, చంద్ర, సి.రంగ లోకేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు

ప్రజాశక్తి-గాలివీడు

డిగ్రీ పరీక్షలను శుక్రవారం నుంచి డిసెంబర్ 20 తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఫస్ట్ సెమిస్టర్ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష థర్డ్ సెమిస్టర్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుం దన్నారు. 5వ సెమిస్టర్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. 235 మంది విద్యార్థులు విద్యార్థులు ఫస్ట్ సెకండ్ ఫిఫ్త్ సెమిస్టర్ డిగ్రీ ఎగ్జామ్స్ రాస్తున్నట్లు పేర్కొన్నారు. సప్లమెంటరీ కూడా 25 మంది విద్యార్థులు రాస్తున్నారని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి జాగ్రత్తలు చర్యలు తీసుకున్నమని పేర్కొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, చిన్నమండెం మండలం మల్లూరు పంచాయితీ, మల్లూరులో నివాసం ఉంటున్న పోలీస్.అహ్మద్ భాషా గారి కుమారుడు పోలీస్. అస్గర్ అలీ కి చెందిన పాస్ పోర్ట్ గత నెల 19వ తేదీన మల్లూరు క్రాస్ వద్ద ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్ **M8160767** పోయినది.ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గానీ, లేదా **91602 04097** మొబైల్ నెంబర్ గాని తెలుపగలరు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు మండలంలోని ప్రజల సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ నాగార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో ధ్వజారెడ్డి మాట్లాడుతూ వర్షాలు తరచూ పడుతుండడం వలన అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమా వేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని వాటిని అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. గ్రామ పంచాయతీలలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల గురించి సంబంధిత సర్పంచ్‌లకు సమా చారం ఇవ్వడం లేదని సర్పంచ్‌లు దార్ల చంద్రశేఖర్, హరికృష్ణ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు .కె.బుడుగుంటపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై సర్పంచ్ చంద్రశేఖర్, ఎపిఒ ఉమామహేశ్వరరావును ప్రశ్నించారు. అనంతరాజుపేట వద్ద నుంచి కుక్కలదొడ్డి వరకు ప్రధాన రహదారిలో భారీ గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఎంపిటిసి బండారు మల్లికార్జున అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు సత్వరం పూడ్చకపోతే పార్టీలకతీతంగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో ధర్నా నిర్వహిస్తామని ధ్వజారెడ్డి అన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని శాఖల అధికారులకు నోటీసులు పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు పాలెంకోట రత్నమ్మ, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, ఎఒ చంద్ర బాబురాజు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ధ్వజారెడ్డి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

పుల్లంపేట : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ పేర్కొన్నారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొమ్మనవారిపల్లి రైతు సేవా కేంద్రం, కేతరాజుపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇ-పంట నమోదు తప్పక చేయించుకొని ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ ప్రతి రైతు ఎక్కువ మోతాదులో పురుగు మందులు పంట పొలాల్లో వాడడం వలన పంటదిగుబడితో పాటు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించి కూరగాయలు, ఆకుకూరలు తినడం వలన ఆరోగ్యంగా ఉండడం జరుగుతుందని పేర్కొన్నారు. ఘణ జీవామృతం, ద్రవ జీవామృతం పొలాల్లో వాడటం వలన అధిక దిగుబడి రావడం వస్తుందని అన్నారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఇ-పంట నమోదు రబీలోచేయించుకోవాలని వివరించారు. వెటర్నరీ అసిస్టెంట్ సుజాత మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇంద్రజ, సునీత దేవి, వెటర్నరీ అసిస్టెంట్ తనుజ రైతులు పాల్గొన్నారు. **నందలూరు :** ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని రాజంపేట వ్యవసాయ శాఖ ఎడిఎ రమేష్‌బాబు పేర్కొన్నారు. టంగుటూరు రైతు సేవా కేంద్రంలోని చింతకాయలపల్లి గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంట పంట బీమా ప్రీమియం ఎకరాకు రూ.128లు డిసెంబర్ 31వ తేది లోపు చెల్లించుకోవాలని, వ్యవసాయ శాఖ అమలుచేస్తున్న కార్య క్రమాలను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీవల్లి మాట్లాడుతూ వరి నారు మడిలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఊటుకూరు పరిశోధనా కేంద్రం యుటిఆర్ -181 వరి రకం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎఒ జి.మల్లిఖార్జున, రైతూసేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

15లోగా రబీ పంటల బీమా చేసుకోండి :డిఎఒ

మదనపల్లె అర్బన్ డిసెంబర్15 లోగా రబీ పంటల బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలం చీకలబైలు పంచాయతీ పరిధిలోని తిప్పారెడ్డిగారిపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చంద్రా నాయక్, మదనపల్లి ఎఒ నాగప్రసాద్, హెచ్ఒ. ఈశ్వర్‌రెడ్డి బృందం పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్ర నాయక్ మాట్లాడుతూ రబీకి సంబంధించి డిసెంబర్ 15లోగా టమాటో, వరి, వేరుశనగ పంటకు పంటల బీమా చేసుకోవాలని రైతులకు సూచించారు. రబీ ఇ-పంట నమోదు త్వరలోనే చేపట్టుడం జరుగుతుందని తెలిపారు. రైతులందరూ భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులను వాడాలని కోరారు. రైతులకు భూసార పరీక్షా కార్డులను అందించారు. పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో మదనపల్లి ఎడిఎశివశంకర్, ఏఓ నాగ ప్రసాద్, టెక్నికల్ ఎఒ రమేష్ రాజు, ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, విఎఎ తేజ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న డిఎఒ చంద్రానాయక్

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన పెంచుకుని వాటిని అరికట్టాలని వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు ప్రభావతి అన్నారు. 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచారాన్ని మహిళా శిశు అభివృద్ధి మంత్రి విజ్ఞాన్ భవన్‌లో వెబ్‌కాస్ట్ లింక్‌లో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులకు 18 సంవత్సరాలు, యువకులకు 21 సంవత్సరాల వివాహ వయస్సు అని తెలిపారు. ఈ వయసులోపు వివాహ చేస్తే దాన్ని బాల్య వివాహం కింద పరిగణించవచ్చన్నారు. ఇటువంటి వివాహాలు జరగడం ద్వారా ముఖ్యంగా ఆడపిల్లలు శారీరకంగానూ, మానసికంగానూ ఆర్థికంగానూ అనేక సమస్యలు ఎదుర్కొంటారని అన్నారు. బాల్య వివాహం వల్ల బాలికలు గర్భం దాల్చే సన్నద్ధత లేకపోవడంతో పుట్టబోయే బిడ్డకు తల్లికి ప్రాణహాని ఉంటుందని అన్నారు. ప్రస్తుతానికి బాల్యవివాహాలు తగ్గినా, ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఆడపిల్లల తల్లిదండ్రులు అవగాహన రాహిత్యంతో తమ పిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు జరిపించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇకపై అలాంటి ప్రయత్నాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త పడాలని కోరారు. మీ చుట్టూ బాల్యవివాహాలు జరుగుతుంటే 1098 లేదా 100కి ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు.అనంతరం బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది షేక్ హసీనా, రెడ్డి ప్రసన్న, శ్రావణి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు రమణ ఆధ్వర్యంలో ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థుల చేత బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ రమణ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్య నేరమని, సమాజంలో చుట్టుపక్కల ఎవరైనా బాల్యవివాహాలు చేస్తుంటే ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. బాల్యవివాహాలు వ్యతిరేకించడం భారత పౌరునిగా మన బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, ఈశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ లోకేష్ రెడ్డి అన్నారు. బుధవారం ఎస్ఐ ఆదేశాల మేరకు ఎఎస్ఐ నజీర్ భాషా తంబళ్లపల్లిలో వెలుగు మహిళా సమైక్య సభ్యులు, కూటమి నాయకులతో కలిసి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరం అన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గంగాధర్, ఎఎస్ఐ నజీర్‌బాషా, సిసిలు, కూటమి నాయకులు, సంఘమిత్రలు పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల పరిధిలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో బాల్య వివాహాల పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక ఎస్ఐ వి.సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ సరైన అర్హత వయస్సు లేకుండా వివాహాలు జరిగితే అన్ని అనర్థాలు జరుగుతాయని అన్నారు. చిన్న వయస్సులో కుటుంబ బాధ్యతలు, ఉపాధి, ఆదాయ మార్గాలు లేకుండా కుటుంబ వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. చిన్న వయసులో వివాహం ద్వారా శారీరక, మానసిక అపరిపక్వత వలన గర్భస్రావాలు అనారోగ్య సమస్యలు, భార్యాభర్తల మధ్య అపోహలు ముదిరి విడాకుల వరకు దారి తీస్తాయని అన్నారు. యువత బాగా చదివి భవిష్యత్ ప్రణాళిక ద్వారా తల్లిదండ్రులకు దేశానికి గొప్ప పేరు తేవాలని ప్రిన్సిపల్ నరసింహులు ఆకాంక్షించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చిన్నమండెం సాయిఅమరావతి స్కూల్, మల్లూరు హైస్కూల్, బాల్య వివాహాలకు వ్యతిరేకంగావిద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.**గాలివీడు :** తహశీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహరహిత భారతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తికాని వారంతా కూడా బాలలేని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే సహించేది లేదని వారిని వారిపై చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసు కూడా పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు రహంతుల్లా నిర్మల్‌కుమార్, లక్ష్మీ ప్రసన్న విఆర్‌ఎలు బుజ్జి, అలీ, విజయ్ పలువురు పాల్గొన్నారు. **రామసముద్రం :** రామసముద్రం మండల అభివృద్ధి అధికారి భాను ప్రసాద్ ఆధ్వర్యంలో రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో పట్టణంలో ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలుపై వివరించారు. మైనర్లును పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నం చేసినా వ్యక్తులు, పెళ్లి పెద్దలు, మైనర్ల తల్లిదండ్రులు కూడా చట్ట రీత్యా నెరస్తులేనని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట సుబ్బయ్య, కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు, ఎంఇఒ హేమలత, సిడిపిఒ సుజాత, ఎపిఎం సాంబశివ, ఎపిఒ గౌరీశంకర్ పాల్గొన్నారు. **పీలేరు:** ఆంధ్రప్రదేశ్ ను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యతని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. "బాల్య వివాహ్ ముక్త్ భారత్" దినోత్సవ సందర్భంగా బుధవారం పీలేరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల బాలికలకు బాల్య వివాహాలు - అనర్థాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల వ్యక్తులు, కుటుంబం, సమాజానికి కలిగే నష్టాలు ఆడబిడ్డ తెలుసుకుని బాల్య వివాహ నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేద్దామని బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎఎన్ఎం భార్గవి, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటి : బాలవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ప్రభావతి

వైద్యం అందక గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సకాలంలో వైద్యం అందక జిల్లా ఆస్పత్రిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. సుమారు 60 ఏళ్ళ వయసున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం ఆస్పత్రిలో నరసింహులు అనే పేరుతో ఒపి రాయించుకుని క్యూలో నిలబడ్డాడు. ఎక్కువసేపు నిలబడలేక పోయిన బాదితుడు క్యూ లైన్ లోనే ఒక్కసారిగా అందరూ చూస్తుండగానే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఆస్పత్రి సిబ్బంది గమనించి మృతదేహాన్ని తీసుకెళ్లి దూరంగా పడుకోబెట్టి గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రి ఆవరణలో చనిపోయాడని పోలీసులకు సమాచారం అందించారు. రెండవ పట్టణ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని అన్నారు. చనిపోయిన వ్యక్తి ఎవరనేది తెలియ రాకపోవడంతో అతని ఆచూకీ తెలపాలని సిఐ కోరారు.

అపార్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులను భారత ప్రభుత్వం ప్రారంభించిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ సమస్య నుంచి విముక్తి కల్పించాలని ఎస్ఎఫ్ఐ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఎంఇఒ, ఎంపిడిఒలకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా డేటాను డిజిటల్ కేంద్రీకరించడానికి కీలకమైనది అని అయితే, అపార్ ఐడి కోసం దరఖాస్తు చేసే విద్యార్థులు తమ ఆధార్ కార్డులను అప్డేట్ చేయడంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని కోరారు. విద్యార్థులు ఆధార్ సెంటర్లకు వెళ్తే అక్కడ వారు ఇతర సెంటర్లకు వెళ్లమని సూచిస్తున్నారని అన్నారు. రిజెక్ట్ అయిన అప్లికేషన్లపై అధిక అపరాధ రుసుం విధించబడుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, సిఆర్పి మురళీ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

జడ్‌పి హైస్కూల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రంలోని నందలూరు జడ్‌పి హైస్కూల్‌ను బుధవారం డిఇఒ సుబ్రహ్మణ్యం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధన అభ్యసన ప్రక్రియలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, ఉపాధ్యాయులకు సంబంధించిన అకడమిక్ మానిటరింగ్ అంశాలను పరీక్షించారు. పనితీరు పట్ల సంతృప్తి వ్యక్త పరచి, పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం విద్యార్థులచే బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా జిసిడిఒఎస్.శశికళ, డిఇఒ కార్యాలయ క్యాంప్ క్లర్క్ ఎస్.హాబీబ్, పాఠశాల బాధ్య బాధ్య ప్రధానోపాధ్యాయులు ఎస్.రౌఫ్‌బాషా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కులను అందిస్తున్న బ్యాంకు అధికారులు

పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నందలూరు బ్రాంచ్ ద్వారా ఎపిజిబి ప్రగతి విద్యా జ్యోతి స్కాలర్ షిప్ పథకం కింద పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ముగ్గురు ప్రతిభావంతులైన పేద బాలికలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ జాహ్నవీధర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం సీనియర్ మేనేజర్ పర్యవేక్షణలో పేద విద్యార్థులైన వైష్ణవి, శివ ప్రసన్న, హర్ష నందినిలకు ఆర్థికంగా సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌రాజు, ఉపాధ్యా యురాలు లక్ష్మీకాంతం, శ్రీరామ్‌కుమార్, పిఇటి జగన్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ఫిల్టర్‌ను అందిస్తున్న సంపత్‌కుమార్, మహేశ్వరరెడ్డి

పాఠశాలకు మినరల్ వాటర్ ఫిల్టర్ వితరణ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సురకవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రీన్‌కో సోలార్ క్లస్టర్ ఇన్‌ఛార్జి సంపత్ కుమార్, మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్యూరిఫైయర్ మినరల్ వాటర్ ఫిల్టర్‌ను బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డికి అందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పేద విద్యార్థుల ఆరో గ్యం కోసం మినరల్ వాటర్ ఫిల్టర్ అందించడం అభినందనీయని అన్నారు. గ్రీన్ కో సోలార్ సిబ్బం దికి గ్రామ నాయకులు తాతిరెడ్డి ప్రదీప్ కుమార్‌రెడ్డి, కోటిరెడ్డి, రామాంజులు రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ స్రవంతి జీవన్‌రెడ్డి, కృష్ణారెడ్డి రాంరెడ్డి, నాగభూషణరెడ్డి, రామంజల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.4 లక్షలు విరాళం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు మండలంలోని తాడేవాండ్లపల్లి గ్రామంలో మాతమ్మగుడికి వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి నాలుగు లక్షల రూపాయలు విరాళం నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తనవంతుగా సహకారం అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి వైసిపి ఎంపిపి తన దాతృత్వాన్ని చాటుకున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్ర మంలో ఎంపిటిసిలు నూక మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు నాయని హరికృష్ణరెడ్డి, బుడుగి శివయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి

క్రైం కార్నర్

నీటితొట్టిలో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీకి చెందిన ఫాతిమా(75)కు కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఫాతిమాకు వృద్ధాప్యం ఉండడంతో నడకతో పాటు చూపు కూడా సరిగ్గా లేదని స్థానికులు తెలిపారు. బుధవారం వేకువజామున కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలోని నీటి తొట్టెలో ప్రమాదవశాత్తు పడిపోయింది. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనాస్థలానికి చేరుకొని వృద్ధురాలి బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెందారు.

లారీ, బస్సు ఢీ : 20 మందికి గాయాలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

జిల్లా లోని సంబెపల్లి మండలం ఎర్రగుంట్ల వద్ద కడప-చిత్తూరు జాతీయ రహదారిలో బుధవారం తెల్లవారు జామున రోడ్డుప్రమాదం జరిగింది. ప్రయివేట్ బస్సు, లారీ ఢీకొని బస్సులో ప్రయాణిస్తున్న 20మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను దగ్గరలో గల రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..విజయనగరం జిల్లా నుంచి 50 మంది అయ్యప్ప స్వామి భక్తులు శబరి మలకు దర్శనం కోసం వెళుతుండగా మార్గ మధ్యలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో బస్సు లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయిందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చెసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.